

అప్రమత్తం 8లో

విపత్తుల సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలపై ఎన్డీఆర్ఎఫ్ బృందం అవగాహన కల్పించింది. రాంబిల్లి హైస్కూల్లో మాక్‌డ్రిల్ నిర్వహించింది.



తవ్వుకో... అమ్ముకో... 8లో

తాండవలో ఇసుక తవ్వకాలు కూటమి నేతలకు కాసులు కురిపిస్తోంది. లోతుగా తవ్వేయడంతో వంతెనలకు ప్రమాదం పొంచి ఉంది.



మహిళల క్రిస్మస్

బీచ్‌రోడ్డు: విశాఖలోని ఆశ్రయ్ మినిస్ట్రీస్‌లో బుధవారం మహిళల క్రిస్మస్ వేడుకలు సందడిగా నిర్వహించారు.

న్యూస్‌రీల్

ఇసుక ట్రాక్టర్లను అడ్డుకున్న రైతులు



జంగాలపల్లిలో రైతులు అడ్డుకోవడంతో ఆగిన ఇసుక ట్రాక్టర్లు

మాకవరపాలెం: ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను రైతులు అడ్డుకున్నారు. మండలంలోని జంగాలపల్లి సమీపంలో సర్పానదిని ఆనుకుని ఉన్న ప్రభుత్వ భూమి నుంచి నెల రోజులుగా ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. ఈ తవ్వకాల వల్ల సమీప జిరాయితీ భూములకు ముప్పు ఉందని రైతులు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు, స్థానిక తహసీల్దార్‌కు ఫిర్యాదులు చేశారు. అయినా రాత్రి పగలూ తేడా లేకుండా ఇసుక తవ్వకాలు జరగడంతో బుధవారం రైతులు ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారీ లోతున జరుగుతున్న తవ్వకాలను వెంటనే నిరోధించాలని అధికారులను డిమాండ్ చేశారు. లేకుంటే భారీ వర్షాలు పడినప్పుడు సర్పానది కారణంగా తమ భూములకు ముప్పు తప్పదని ఆవేదన వ్యక్తం చేశారు.

సివిల్స్‌లో ఉచిత శిక్షణ

తుమ్మపాల : యూపీఎస్సీ నిర్వహించే సివిల్స్ పరీక్షల్లో ప్రిలిమ్స్, మెయిన్స్ పరీక్షలకు సంబంధించి ఉచిత శిక్షణ పొందేందుకు బీసీ, ఎస్సీ, ఎస్టీ నిరుద్యోగ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు జిల్లా బీసీ సంక్షేమ సాధికారిత అధికారి కె.రాజేశ్వరి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 24 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు ఏదైనా డిగ్రీ పూర్తి చేసి ఉండాలన్నారు. 2 పాస్‌పోర్టు సైజు ఫొటోలు, విద్యా, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్, పాన్ కార్డు జతపరచి దరఖాస్తును పట్టణంలో రఘురామ కాలనీ, సర్వేపల్లి రాధాకృష్ణన్ జూనియర్ కాలేజీ వీధి, డోర్ నెం. 10-06-31/7, అనకాపల్లి జిల్లా చిరునామాలో గల కార్యాలయానికి నేరుగా దరఖాస్తు సమర్పించాలని తెలిపారు. మరిన్ని వివరాల కోసం ఫోన్ నెం.9885845743, 8247036596 సంప్రదించాలని తెలిపారు. అభ్యర్థులకు ఈ నెల 27న ఎంపిక పరీక్ష ఉంటుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అర్హత పొందిన 100 మందికి ఏపీ స్టడీ సర్కిల్, బీసీ భవన్, విజయవాడలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు వివరించారు.

పెద్దేరు నీటిమట్టం తగ్గుముఖం

మాడుగుల : మండలంలో అత్యంత జలవనరులు గల పెద్దేరు జలాశయం నీటిమట్టం రోజురోజుకు తగ్గుతుంది. జలాశయంలోకి ఇన్‌ఫ్లో కూడా బాగా తగ్గిపోయింది. జలాశయం గరిష్ఠ నీటి మట్టం 137 మీటర్లు కాగా, ప్రస్తుతం 134 మీటర్లకు తగ్గిపోయింది. గతంలో 200 క్యూసెక్కులున్న ఇన్‌ఫ్లో ప్రస్తుతం 50 క్యూసెక్కులకు తగ్గిపోయింది. పెద్దేరు ప్రధాన పంట కాలువలైన రాచకట్టు కాలువలకు 10 క్యూసెక్కులు, ఆర్ఎంసీ పంట కాలువలకు 60 క్యూసెక్కుల సాగు నీరు విడుదల చేస్తున్నారు. ఇకపై వర్షాలు అనుకూలించకపోతే రబీ పంటలకు సాగునీరు ఆయకట్టు భూములకు అందవేమోనని ఆయకట్టు రైతులు చెబుతున్నారు.



క్యాన్సర్‌ను జయిద్దాం..!

- ముందస్తు పరీక్షలతో ప్రాణాలు పదిలం
- ఆయుష్మాన్ ఎన్‌సీడీ–3.0 పథకంలో ఇంటింటికీ క్యాన్సర్ స్క్రీనింగ్
- 18 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరికీ ఉచితంగా పరీక్షలు
- గుర్తించిన రోగులకు ఫాస్ట్ ట్రాక్ చానెల్ ద్వారా చికిత్స



క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

సాక్షి, అనకాపల్లి: క్యాన్సర్.. ఆ మాట వింటే ఒకప్పుడు వెన్నులో వణుకు పుట్టేది. ఆ రుగ్మత సోకితే ఇక చావే గతి అన్న భయం ఉండేది. వ్యాధి కన్నా ఆ భయంతోనే ఎక్కువగా కుంగిపోయేవారు. అప్పటితో పోలిస్తే చాలా మార్పు వచ్చింది. ప్రస్తుతం వైద్య రంగం సాధించిన ప్రగతితో క్యాన్సర్‌ను కూడా జయిస్తున్నారు. ముందస్తు స్క్రీనింగ్ పరీక్షలతో క్యాన్సర్‌ను తొలి దశలోనే గుర్తించి, సకాలంలో చికిత్స అందిస్తే ఆ మహమ్మారిని ఇట్టే పారదోలవచ్చని వైద్యనిపుణులు చెబుతున్నారు. అలా క్యాన్సర్‌ను జయించి పునర్జన్మ పొందిన వారు చాలామంది ఉన్నారు. వైద్య నిపుణుల సాయంతో, సాంకేతిక సహకారంతో, అన్నింటినీ మించి బతికి తీరాలన్న బలమైన కాంక్షతో.. క్యాన్సర్‌పై విజయం సాధించిన వారు ఉన్నారు. క్యాన్సర్‌పై అవగాహన లేకపోవడంతో తొలి దశలో గుర్తించకపోవడంతో ఎక్కువ మంది మృత్యువాత పడుతున్నారు. జిల్లాలో స్త్రీలు ఎక్కువగా రొమ్ము, గర్భాశయం, పెద్ద పేగు క్యాన్సర్‌ల బారిన పడితే.. వారిలో సగానికి పైగా అవగాహన లేక వ్యాధి ముదిరి మృత్యువాత పడుతున్నారు. పురుషుల్లో ఊపిరితిత్తులు, నోటి, కాలేయ క్యాన్సర్ల బారిన పడుతున్నారు. కేంద్ర ఆరోగ్య శాఖ ఆయుష్మాన్ ఎన్‌సీడీ–3.0 పథకంలో భాగంగా ప్రతి ఇంటికీ వెళ్లి క్యాన్సర్ పరీక్షలు చేసే విధంగా ఈ నెల 14 నుంచి మూడు నెలల పాటు సర్వే జరుపుతోంది. సర్వేతోపాటు ఉచితంగా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు కూడా నిర్వహిస్తోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఆరోగ్యశ్రీలోకి క్యాన్సర్‌ను కూడా చేర్చి.. ఆ పథకంలో రూ.25 లక్షల వరకూ ఉచిత వైద్యసేవలు అందించడంతో రాష్ట్రంలో క్యాన్సర్ మరణాలు తగ్గాయి. ప్రత్యేకించి అనకాపల్లి జిల్లాలో సత్ఫలితాలు వచ్చాయి.



పాయకరావుపేటలో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షల నిర్వహణలో పాల్గొన్న డీఎంహెచ్‌వో డాక్టర్ బాలాజీ

జిల్లాలో క్యాన్సర్ స్క్రీనింగ్ లక్ష్యం

5.72 లక్షల ఇళ్లలో **13,55,051** మంది

సర్వేలో పాల్గొంటున్న సిబ్బంది	
మెడికల్ ఆఫీసర్లు, వైద్యులు	105
పారా మెడికల్ సిబ్బంది	420
ఏఎన్ఎంలు	600
వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు	1500

అవగాహనతో క్యాన్సర్ తగ్గుముఖం



దేశవ్యాప్తంగా ప్రతి 15 మందిలో ఒకరికి క్యాన్సర్ ముప్పు పొంచి ఉంటోంది. చాలామంది అవగాహన లేక, త్వరగా గుర్తించక క్యాన్సర్ బారిన పడుతున్నారు. ప్రాథమిక దశలోనే సరైన చికిత్స తీసుకుంటే ఈ ప్రాణాంతక వ్యాధిని జయించవచ్చు. శిక్షణ పొందిన వైద్యులు, వైద్య సిబ్బంది వారంలో మూడు రోజులపాటు సర్వేలో పాల్గొంటారు. మూడు నెలల్లోగా సర్వే పూర్తి చేయాలన్నదే లక్ష్యం. ఇప్పటికే సర్వే మ్యాపింగ్ చేశాం. స్క్రీనింగ్ పరీక్షలు కూడా ప్రారంభించాం. తొలి వారంలో 500 మందిని పరీక్షించాం.

– డాక్టర్ బాలాజీ, డీఎంహెచ్‌వో

కంప్యూటరీకరణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- సహకార సంఘాల సభ్యుల వివరాలు 22లోగా అప్‌లోడ్ చేయాలి
- సమీక్ష సమావేశంలో కలెక్టర్ విజయ కృష్ణన్ ఆదేశం



సహకార శాఖ, ఆప్కాబ్ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్

తుమ్మపాల: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల కంప్యూటరీకరణ పనులను వెంటనే పూర్తి చేయాలని కలెక్టర్ విజయ కృష్ణన్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో కోఆపరేటివ్, డీసీసీబీ, ఆప్కాబ్ అధికారులతో సమావేశం నిర్వహించి కంప్యూటరీకరణ పనుల పురోగతిని సమీక్షించారు. కంప్యూటరీకరణ పనులు పూర్తిచేయకపోవడం, రాష్ట్ర స్థాయి సూచీలలో జిల్లా వెనుకబడటంపై ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు. కంప్యూటరీకరణ పనులలో నిర్లక్ష్యం వహించే అధికారులు, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సహకార సంఘాల సభ్యుల పూర్తి వివరాలు సేకరించి కంప్యూటరీకరించాలన్నారు. డేటా సేకరణ, అప్‌లోడ్ పనులను ఈనెల 22 నాటికి పూర్తిచేయాలన్నారు. సహకార శాఖ జిల్లా అధికారి ఎ.ప్రేమ స్వరూపరాణి, జిల్లా కోఆపరేటివ్ అకౌంట్స్ అధికారి జి.గోవిందరావు, డీసీసీబీ సీఈవో వర్మ, ఆప్కాబ్ డీపీడీఎం రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలపై అఘాయిత్యాలు.. ఎన్నాళ్లీ ఘాతుకాలు?

- కొవ్వొత్తులతో ఎస్ఎఫ్ఐ నిరసన

యలమంచిలి రూరల్: కూటమి ప్రభుత్వంలో మహిళలపై అఘాయిత్యాలు, హత్యలు, అత్యాచారాలు పెరిగాయని, దిశా చట్టాన్ని అమలు చేసి వారికి రక్షణ కల్పించాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) జిల్లా కార్యదర్శి ఎం.రమణ డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో యలమంచిలి టౌన్‌లో బుధవారం రాత్రి కొవ్వొత్తులతో నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత ప్రాతినిధ్యం వహిస్తున్న ఉమ్మడి విశాఖ జిల్లాలోనే పరిస్థితి దారుణంగా ఉందన్నారు. తాజాగా విశాఖలో లా విద్యార్థినిపై సామూహిక లైంగిక దాడి జరగడంతో బాధితురాలు ఆత్మహత్యకు యత్నించిందని, ఈ ఘటన బాధాకరమన్నారు. ఇంతకు ముందు రాంబిల్లి మండలం కొప్పుగుండుపాలెంలో ప్రేమోన్మాది చేతిలో దక్షిత అనే అమ్మాయి హత్యకు గురయ్యిందన్నారు. మహిళలు రక్షణ కల్పించడంలో హోం మంత్రి వంద శాతం ఫెయిలయ్యారని, తక్షణం తమ పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు పాల్గొన్నారు.



యలమంచిలి టౌన్‌లో ఎస్ఎఫ్ఐ కొవ్వొత్తుల ప్రదర్శన

వేధింపులు ఆపండి.. 'వెలుగు' చూపండి

- సమస్యల పరిష్కారానికి వీవోఏల ఆందోళన

తుమ్మపాల: తమ సమస్యలను పరిష్కరించాలని, మూడు సంవత్సరాల కాలపరిమితి రద్దు చేయాలని, వేధింపులు ఆపాలని, బకాయివేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ వెలుగు శాఖలో పనిచేస్తున్న వీవోఏలు బుధవారం కలెక్టరేట్ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మూడేళ్ల కాలపరిమితి అమలు చేయడం వల్ల 15 ఏళ్లకు పైగా పనిచేస్తున్న వీవోఏల కుటుంబాలు రోడ్డున పడతాయని వాపోయారు. రాష్ట్ర వ్యాప్తంగా పలు చోట్ల వీవోఏలను తొలగిస్తున్నారని దీనిపై ప్రభుత్వం స్పందించాలని కోరారు. నాలుగు నెలలుగా వేతనాలు అందక ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. ప్రభుత్వం స్పందించి తమ సమస్యలు పరిష్కరించాలని వారు కోరారు. అంతకుముందు డీఆర్వో బి.దయానిధికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు కె.సూరిబాబు, కోశాధికారి కె.లక్ష్మీ ప్రసన్న, వై.లక్ష్మీరాజేష్, మాణిక్యం, పద్మ, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న వీవోఏలు

ఆటో డ్రైవర్ నిజాయితీ

చీడికాడ : తనకు దారిలో దొరికిన నూతన వస్త్రాలను జాగ్రత్తగా వాటి సొంతదారుకు అందించిన ఆటోడ్రైవర్ నిజాయితీని అందరూ అభినందిస్తున్నారు. వివరాలివి. మండలంలోని మంచాల గదబూరుకు చెందిన ఎంగిలి నరసమ్మ కుమారుడి వివాహం కోసం కుటుంబ సభ్యులు మంగళవారం అనకాపల్లి వెళ్లి రూ.15 వేల విలువ చేసే నూతన వస్త్రాలను కొనుగోలు చేసి రాత్రి 8 గంటల సమయంలో ఆటోలో చోడవరం నుంచి తమ గ్రామానికి వెళ్లిపోయారు. అయితే మార్గమధ్యంలో వారి నూతన వస్త్రాల బ్యాగు రోడ్డుపై పడిపోయింది. వారు అది గమనించకుండా వెళ్లిపోయారు. అదే మార్గంలో చీడికాడకు చెందిన వేచలపు నాయుడు తన ఆటోలో చీడికాడ వస్తుండగా వరహాపురం, దాముసాపల్లి మధ్యలో రోడ్డుపై పడి ఉన్న బట్టల బ్యాగును గుర్తించారు. ఆ బ్యాగులో ఉన్న బట్టల బిల్లుపై గల ఫోన్ నెంబర్‌కు ఫోన్‌చేసి పోగొట్టుకున్న వారి వివరాలు తెలుసుకున్నారు. బుధవారం ఉదయం మంచాల గదబూరు వెళ్లి నరసమ్మ కుటుంబ సభ్యులకు ఆ వస్త్రాల బ్యాగును అందించాడు. పెళ్లి వస్త్రాలు పోగొట్టుకోవడం అశుభంగా తలచి బాధపడుతున్న సమయంలో ఆటో డ్రైవర్ నాయుడు ద్వారా నూతన వస్త్రాలు తిరిగి తమ చెంతకు చేరడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. నాయుడు నిజాయతీని గ్రామస్తులు అభినందించారు.



బాధిత గిరిజనులకు దుస్తులను అందిస్తున్న ఆటో డ్రైవర్ నాయుడు

మెగా డీఎస్సీ ఉచిత శిక్షణకు దరఖాస్తుల గడువు పొడిగింపు

తుమ్మపాల : ఈ నెల 25 వరకు మెగా డీఎస్సీ ఉచిత శిక్షణకు దరఖాస్తు గడువు పొడిగించినట్టు శిక్షణ కేంద్రం డైరెక్టర్, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ సాధికారిత అధికారి కె.రాజేశ్వరి ఒక ప్రకటనలో బుధవారం తెలిపారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ డీఎస్సీకి దరఖాస్తు చేసిన అభ్యర్థులు ఉచిత శిక్షణ కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అర్హులైన అభ్యర్థులు తమ బయోడేటాతో పాటు 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ మార్కుల లిస్టు, టీటీసీ, బీఎడ్, టెట్‌లో అర్హత సాధించిన మార్కుల జాబితా కుల ధ్రువీకరణ పత్రం, ఆదాయ ధృవీకరణ పత్రం (తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.లక్ష లోపు మాత్రమే), ఆధార్ కార్డు బ్యాంకు పాస్ పుస్తకం, జిరాక్స్, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు జతపరచి అందజేయాలని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు 2 నెలల పాటు ఉచిత శిక్షణతో పాటు స్టైఫండ్ నెలకు రూ.1500, స్టడీ మెటీరియల్‌కు రూ.1000 చెల్లిస్తారని తెలిపారు. పట్టణంలో రఘురామ కాలనీ, సర్వేపల్లి రాధాకృష్ణన్ జూనియర్ కాలేజీ వీధి, డోర్ నెం.10-06-31/7, అనకాపల్లి, చిరునామాలో గల కార్యాలయానికి నేరుగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. మరింత సమాచారం కోసం ఫోన్ నెం: 9885845743 కు సంప్రదించాలని సూచించారు.

చెరకు రస నాణ్యత పరీక్షలు ప్రారంభం

- గోవాడ సుగర్స్‌లో క్రషింగ్‌కు చకచకా ఏర్పాట్లు

చోడవరం: ఈ ఏడాది క్రషింగ్ సీజన్‌కు గోవాడ సుగర్ ఫ్యాక్టరీ సర్వం సిద్ధం చేసింది. మరో 20 రోజుల్లో క్రషింగ్ ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు చేసింది. ముందుగా ఓవరాయిలింగ్ జరిగిన యంత్రాల పనితీరుపై ట్రయల్ రన్ పనులు చేపట్టారు. బుధవారం చెరకు నాణ్యత పరీక్షలను ప్రారంభించారు. చెరకు తోటల్లో పక్వానికి వచ్చిన పంటకు రసనాణ్యత పరీక్ష చేసిన తర్వాత కటింగ్ పర్మిట్లు ఇస్తారు. ముందుగా చెరకు గడల రస నాణ్యత పరీక్షలు విస్తృతంగా చేయాల్సి ఉండటంతో ఆ పరీక్షలను ఫ్యాక్టరీ మేనేజింగ్ డైరెక్టర్ వి.వి.సన్యాసినాయుడు ప్రారంభించారు. ఈ ఏడాది క్రషింగ్ సీజన్‌ను డిసెంబరు రెండో వారంలో లాంఛనంగా ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. అయితే క్రషింగ్ ప్రారంభించే సమయానికి రోజుకు కనీసం 1000 నుంచి 2000 టన్నుల చెరకు ఫ్యాక్టరీకి సరఫరా కావాల్సి ఉంది. రెగ్యులర్ క్రషింగ్ జోరందుకుంటే రోజుకు 3 వేల నుంచి 4 వేల టన్నుల వరకు చెరకు అవసరమవుతుంది. ఈ పరిస్థితుల్లో ఇప్పటి నుంచే ఫ్యాక్టరీ పరిధిలో ఉన్న చెరకుకు రసనాణ్యత పరీక్షలు చేసి కటింగ్ పర్మిట్లు ఇవ్వాలని ఫీల్డ్ సిబ్బందికి యాజమాన్యం ఆదేశాలు జారీ చేసింది. పక్వానికి వచ్చిన తోటలను వ్యవసాయ ఫీల్డ్ సిబ్బంది గుర్తించి రసనాణ్యత పరీక్షలకు తరలించే పనులకు శ్రీకారం చుట్టామని ఎండీ తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది, కార్మిక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



రస నాణ్యత పరీక్షల యంత్రాన్ని ప్రారంభిస్తున్న ఫ్యాక్టరీ మేనేజింగ్ డైరెక్టర్ సన్యాసినాయుడు

జిల్లాలో 6 ఇసుక స్టాక్ యార్డులు

సాక్షి, అనకాపల్లి: జిల్లాలో ఆరు ఇసుక స్టాక్ యార్డులను ఏర్పాటు చేయనున్నట్టు జిల్లా ఇసుక కమిటీ చైర్‌పర్సన్, కలెక్టర్ విజయ కృష్ణన్ చెప్పారు. జిల్లాలో ఇసుక రీచ్‌లు లేకపోవడం.. రెండే డిపోలు ఉండడంతో వినియోగదారులకు ఇబ్బంది లేకుండా ఈ చర్య తీసుకున్నట్టు బుధవారం ఆమె ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రీచ్‌ల నుంచి ఇసుక తీసుకువచ్చి, నిల్వ చేసి విక్రయించేందుకు ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవచ్చునని చెప్పారు. నాలుగు ఎకరాల స్థలంలో స్టాక్ యార్డులను ఏర్పాటు చేయాలని, వాహనాలు వెళ్లేందుకు మార్గం ఉండాలని సూచించారు. జిల్లా గనుల శాఖ వీరికి మినరల్ డీలర్ లైసెన్స్ మంజూరు చేస్తుందన్నారు. జిల్లాలో అనకాపల్లి, నర్సీపట్నం, నక్కపల్లి, చోడవరం, మాడుగుల, అచ్యుతాపురంలలో ఇసుక స్టాక్ యార్డులను ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు.

అనకాపల్లిలోని గనుల శాఖ కార్యాలయంలో ఈనెల 22 నుంచి 29వ తేదీ లోగా దరఖాస్తు ఇవ్వాలన్నారు. దరఖాస్తుతోపాటు ఒక్కో ఇసుక స్టాక్ యార్డుకు డిస్ట్రిక్ట్ లెవల్ శాండ్ కమిటీ పేరిట రూ.5 వేల డిమాండ్ డ్రాఫ్ట్ జత చేయాలని పేర్కొన్నారు. జిల్లా ఇసుక కమిటీ నిర్దేశించిన ధరకే ఇసుక విక్రయించాలన్నారు.

జిల్లా ఇసుక కమిటీ నిర్ణయించిన ధరలు ఇవే..

స్టాక్ యార్డు	ప్రభుత్వ నిర్ణయించిన ధర (టన్ను) రూ.లలో
అనకాపల్లి	1000
నర్సీపట్నం	900
చోడవరం	1100
మాడుగుల	1100
నక్కపల్లి	800
అచ్యుతాపురం	1000

పోలి పాడ్యమికి ప్రత్యేక ఏర్పాట్లు

సింహాచలం: వచ్చేనెల 2న పోలి పాడ్యమిని పురస్కరించుకుని సింహగిరి దిగువ వరాహ పుష్కరిణి వద్ద దీపాలు విడిచిపెట్టేందుకు వచ్చే భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్టు సింహాచలం దేవస్థానం ఈవో వి.త్రినాథరావు తెలిపారు. పుష్కరిణి నీటిలోకి ఎవరూ దిగకుండా బారికేడ్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు.

మార్కెట్ కూడలి నుంచి పుష్కరిణికి వెళ్లే మార్గంలో పోలీస్ బందోబస్తుతో పాటు దేవస్థానం కమ్యూనిటీ గార్డులను ప్రత్యేకంగా బందోబస్తుకు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. మార్కెట్ కూడలి నుంచి వరాహ పుష్కరిణి వరకు ఎలాంటి వాహనాలు వెళ్లకుండా ట్రాఫిక్ పోలీసులు బందోబస్తు నిర్వర్తిస్తారని తెలిపారు. డిసెంబర్ 1వ తేదీ అర్ధరాత్రి నుంచి దేవస్థానం ఉద్యోగులకు ప్రత్యేక డ్యూటీలు వేసినట్లు వివరించారు.

36,123 గృహాల్లో పశుగణన పూర్తి

- వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకు పశువుల వివరాలు నమోదు
- జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి రామ్మోహన్

అనకాపల్లి: జిల్లాలో పాడి రైతులు 21వ పశుగణనలో తప్పనిసరిగా పశువులను నమోదు చేసుకోవాలని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ రామ్మోహన్ సూచించారు. మండలంలో తుమ్మపాల, వెంకుపాలెం గ్రామాల్లో పశుగణన సర్వే వివరాలను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకూ జిల్లాలో 36,123 గృహాల్లో పశువుల నమోదు కార్యక్రమం పూర్తి చేశామన్నారు.

వచ్చే ఏడాది ఫిబ్రవరి 28వ తేదీ వరకూ పశుగణన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఈ సర్వే వల్ల పశువులకు సకాలంలో వైద్యం, మందులు, ప్రభుత్వ రాయితీలు పొందవచ్చన్నారు. పశువులు వ్యాధుల బారిన పడినప్పుడు సకాలంలో వైద్య సేవలు అందడమే కాకుండా మృతిచెందిన సమయంలో సకాలంలో బీమా మంజూరుకు అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎం.చంద్రశేఖర్, అసిస్టెంట్ డైరెక్టర్ బి.సౌజన్య, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.



వెంకుపాలెంలో పాడి రైతులతో మాట్లాడుతున్న డాక్టర్ రామ్మోహన్

దేశ రక్షణ శక్తిని చాటేలా సీ విజిల్

- విన్యాసాల్లో 500కి పైగా యుద్ధనౌకలు, విమానాలు, హెలికాప్టర్లు, బోట్లు





వివిధ తీరాల్లో సీ విజిల్ విన్యాసాలు

సాక్షి, విశాఖపట్నం : యావత్ ప్రపంచానికి దేశ రక్షణ శక్తిని చాటిచెప్పేలా సమర సన్నద్ధ ప్రదర్శన (సీవిజిల్–2024) దేశ వ్యాప్తంగా ప్రారంభమైంది. భారత నౌకాదళం, తీరగస్తీ దళం, మెరైన్ పోలీస్ వ్యవస్థలు ఉగ్రవాదులకు సవాల్ విసురుతూ.. తీర ప్రాంతంపై భారత రక్షణ దళ పట్టును ప్రదర్శించేందుకు 2018 నుంచి ఏటా రెండు రోజుల పాటు 'సీ విజిల్' పేరుతో విన్యాసాలు నిర్వహిస్తున్నారు. సీవిజిల్–2024 యుద్ధ విన్యాసాల్లో భాగంగా తొలిరోజున సముద్ర తీర రేఖ కలిగి ఉన్న ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, పశ్చిమబెంగాల్, ఒడిశా, పుదుచ్చేరి సహా 13 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 7,516.6 కిలోమీటర్ల పొడవునా సమర సన్నద్ధ ప్రదర్శన నిర్వహించారు. రక్షణ మంత్రిత్వ శాఖ, హోం, షిప్పింగ్, పెట్రోలియం, సహజ వాయువులు, కస్టమ్స్, మత్స్యశాఖ, పశు సంవర్ధక శాఖతో పాటు రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర, రాష్ట్ర ఏజెన్సీలు ఈ విన్యాసాల్లో భాగస్వామ్యమయ్యాయి. అంతర్రాష్ట్ర ఏజెన్సీల సమన్వయం, సమాచార భాగస్వామ్యం, సాంకేతిక పర్యవేక్షణలో మాక్ డ్రిల్ నిర్వహించి ఔరా అనిపించేలా తీర రక్షణ శక్తిని ప్రపంచానికి చెప్పారు. నేవీ, కోస్ట్‌గార్డ్‌కు చెందిన 50 నౌకలతోపాటు 100 పెట్రోలింగ్ బోట్లు ఈ విన్యాసాల్లో పాల్గొన్నాయి. వీటితో పాటుగా యుద్ధ విమానాలు, హెలికాప్టర్లు, సబ్‌మెరైన్‌లు.. ఇలా మొత్తం 500 వరకు ఈ విన్యాసాల్లో పాలుపంచుకున్నాయి. విశాఖ సహా ప్రతి తీరానికి ఐదు మైళ్ల దూరం వరకూ నిఘా వ్యవస్థను పటిష్టం చేసి మాక్ డ్రిల్ తొలి రోజున నిర్వహించారు.

క్లుప్తంగా

అప్పన్న అన్న ప్రసాదానికి 108 బియ్యం బస్తాలు

సినీ నిర్మాత సాయి కొర్రపాటి వితరణ



అన్నప్రసాద భవనంలో బియ్యం బస్తాలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన శాశ్వత అన్నప్రసాద పథకానికి సినీ నిర్మాత, డిస్ట్రిబ్యూటర్ సాయి కొర్రపాటి 108 లలిత బ్రాండ్ బియ్యం బస్తాలను అందజేశారు. ఆ బస్తాలు బుధవారం సాయంత్రం సింహగిరికి చేరుకున్నాయి. దేవస్థానం అధికారులు వాటిని అన్నప్రసాద భవనంలోని స్టోర్‌కు చేరవేశారు.

ఏడు మట్టి ట్రాక్టర్ల పట్టివేత



పట్టుబడిన ట్రాక్టర్లు

మాకవరపాలెం: మట్టి తరలిస్తున్న ఏడు ట్రాక్టర్లను పోలీసులు బుధవారం పట్టుకున్నారు. ఏపీఐఐసీ భూముల్లోంచి మట్టిని తరలిస్తున్నారంటూ పోలీసులకు సమాచారం అందడంతో మండలంలోని రామన్నపాలెం శివారు వెంకయ్యపాలెం గ్రామ సమీపంలో మట్టిని తవ్వుతున్న ప్రాంతానికి చేరుకుని ఏడు ట్రాక్టర్లు, ఒక జేసీబీని స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ దామోదర్‌నాయుడు మాట్లాడుతూ ట్రాక్టర్లను రెవెన్యూ అధికారులకు అప్పగించనున్నట్టు తెలిపారు.

సారా బట్టీలపై దాడులు



బెల్లం పులుపును ధ్వంసం చేస్తున్న పోలీసులు

నర్సీపట్నం: మండలంలోని చెట్టుపల్లి పరిసర ప్రాంతాల్లో జీడిమామిడి తోటల్లో గల సారా బట్టీలపై రూరల్ సీఐ ఎల్.రేవతమ్మ ఆధ్వర్యంలో రూరల్ ఎస్ఐ రాజారావు సిబ్బందితో బుధవారం దాడి చేశారు. నాలుగు వేల లీటర్ల బెల్లం పులుపును ధ్వంసం చేసి, సారా తయారీకి ఉపయోగించే వంట పాత్రలను స్వాధీనం చేసుకున్నారు. సారా తయారీ, అమ్మకాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

తవ్వుకో.. అమ్ముకో..
మనల్ని ఆపేదెవరు ?

- తాండవలో యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు
- కూటమి నేతలకు కాసులు కురిపిస్తున్న ఇసుక అక్రమ రవాణా
- పట్టించుకోని అధికారులు
- లోతుగా తవ్వేయడంతో వంతెనలకు పొంచి ఉన్న ప్రమాదం
- చమ్మచింత వద్ద ఆక్విడెక్టు కూలితే నీటి సరఫరాకు ఇబ్బందులు
- రెండు జిల్లాల పరిధిలో వేలాది ఎకరాలకు సాగు నీరు ప్రశ్నార్థకమే

ఇసుకాసురులు చెలరేగిపోతున్నారు. తాండవ నదిలో విచ్చలవిడిగా తవ్వేస్తూ ఇసుక దందా సాగిస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకున్నా ప్రతిరోజూ ట్రాక్టర్లల్లో ఇసుక తరలించి, సొమ్ము చేసుకుంటున్నారు. కూటమి నేతల కనుసన్నల్లో ఇసుక అక్రమ తవ్వకాలు, అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. పట్టపగలే ట్రాక్టర్లలో తరిలించేస్తున్నా అధికారుల చూసీ చూడనట్టు ఉన్నారు. ఇసుకను తోడేస్తుండడంతో వంతెనలకు ప్రమాదం పొంచి ఉంది. అక్విడెట్ కూలితే వేలాది ఎకరాలకు సాగునీరు సరఫరా ప్రశ్నార్థకంగా మారుతుంది.



ఇసుక తవ్విన ప్రాంతం



చమ్మచింత వద్ద తాండవ నదిలో తవ్విన ఇసుకను ట్రాక్టర్‌లో లోడు చేస్తున్న కూలీలు

నాతవరం: మండలంలో చమ్మచింత, పాట్టినా గన్నదొరపాలెం, తాండవ, కె.వి.శరభవరం, గుమ్మడిగొండ, కొవడటిపూడి అగ్రహారం, చిక్కుడుపాలెం, రాజుపేట అగ్రహారం మీదగా తాండవ నది కాకినాడ జిల్లా కోటనందూరు మండలంలోకి ప్రవహిస్తుంది. నాతవరం మండలంలో చిక్కుడుపాలెం, గుమ్మడిగొండ, చమ్మచింత గ్రామాల వద్ద రాకపోకలు సాగించేందుకు తాండవ నదీపై సుమారుగా రూ.12 కోట్ల వ్యయంతో మూడు వంతెనలు నిర్మించారు. చమ్మచింత వద్ద తాండవ రిజర్వాయర్ నుంచి కుడికాలువ ద్వారా నాతవరం మండలంతో పాటు కాకినాడ జిల్లా కోటనందురు, రౌతులపూడి మండలాల్లో ఉన్న ఆయకట్టు భూములకు నీరు ప్రవహించేందుకు నదీలో వంతెన నిర్మించి, అక్విడెట్ ఏర్పాటు చేశారు. చమ్మచింత వద్ద నదిలో నిర్మించిన వంతెన సిమెంటు స్తంభాలు చుట్టూ లోతుగా ఇసుక తవ్వేయడంతో రాళ్లు తేలి ఐరన్ ఊచలు బయటకు కనిపిస్తున్నాయి. రెండు సిమెంటు స్తంభాల ఊచలు పాడైపోవడం కూలేందుకు సిద్ధం ఉన్నాయి. ఇక్కడ నదిలో నిర్మించిన అక్విడెట్ కూలిపోతే రెండు జిల్లాల పరిధిలో వేలాది ఎకరాలకు సాగు నీరు అందించే కూడి కాలువకు నీటి ప్రవాహం నిలిచిపోతుంది.

చమ్మచింత ప్రాంతంలో నదిలో లోతుగా ఇసుక తవ్వకాలు జరుపుతుండడంతో నది ఒడ్డున ఉన్న రైతులు భూములు కోతకు గురయ్యే ప్రమాదం ఉంది. దీంతో రైతులు తవ్వకం దారులను అడ్డుకున్నారు. అధికారులకు సమాచారం ఇచ్చినా కూటమి ప్రభుత్వ పెద్దలకు భయపడి అధికారులు అటువైపు కనీసం కన్నెత్తి చూడలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చమ్మచింత గ్రామానికి చెందిన కొందరు రైతులు ధైర్యం చేసి నదిలో ఇసుక తవ్వకాలు అడ్డుకుని, కూలేందుకు సిద్ధంగా ఉన్న వంతెన సిమెంటు స్తంభాల చుట్టూ రాళ్లు, మట్టి వేసి, దిమ్మగా కట్టారు. ఇసుక తవ్వకాలతో నదిలో ప్రమాదకరంగా ఏర్పడిన గోతులను పూడ్చారు.

50 ట్రాక్టర్లలో తరలింపు

ప్రభుత్వ నిబంధనల ప్రకారం తాండవ నదిలో ఇసుక తవ్వకాలకు అనుమతులు లేవు.అయినా యథేచ్ఛగా తవ్వుతూ రోజూ 50 పైగా ట్రాక్టర్లతో రాత్రీపగలనే తేడా లేకుండా ఇసుక తరలించేస్తున్నారు. ఒక్కో ట్రాక్టరు రోజుకు 5నుంచి 6 ట్రిప్పులు తిరుగుతోంది. నాతవరం మండలంతో పాటు నర్సీపట్నం మున్సిపాలిటీకి, ఇతర ప్రాంతాలకు పట్టపగలే దర్జాగా అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నారు. వాస్తవంగా ఉచిత ఇసుక తరలిచేటప్పుడు విధిగా ట్రాక్టరుకు బ్యానర్ ఉండాలి, ఇసుక రవాణా చేసే ఏ వాహనానికి ఉచిత ఇసుక బ్యానర్ కనిపించడం లేదు.కూటమి నేతలకు భయపడి అన్ని శాఖలు అధికారులు పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారు.

వంతెనలు కాపాడండి



తాండవ నదీలో ఇసుక తవ్వకాలు కొనసాగితే వంతెనలు కూలిపోయే ప్రమాదం ఉంది. వంతెనల నిర్మాణం కోసం వామపక్షాల ఆధ్వర్యంలో ఏళ్ల తరబడి ఆందోళనలు చేశాం. ఆక్విడెక్టు సిమెంటు స్తంభాలు కూలిపోతే రెండుజిల్లాలకు ప్రవహించే తాండవ కుడి కాలువ నీరు నిలిచిపోతుంది, రైతులకు ఊహించని నష్టం జరిగే ప్రమాదం ఉంది.

అడిగర్ల రాజు,
సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు

ప్రకృతి వైపరీత్యాలపై అప్రమత్తం



ప్రకృతి వైపరీత్యాల వల్ల జరిగే ప్రమాదాల గురించి వివరిస్తున్న అధికారి (ఇన్‌సెట్) మంటలు చెలరేగినపుడు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరిస్తున్న ఎన్‌డీఆర్‌ఎఫ్ సభ్యులు

- విపత్తుల సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించిన ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం
- రాంబిల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మాక్‌డ్రిల్

రాంబిల్లి (యలమంచిలి): ప్రకృతి వైపరీత్యాలు,విపత్తులు వచ్చినప్పుడు ప్రతి ఒక్కరూ అప్రమత్తతంగా ఉండాలని నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (ఎన్‌డీఆర్‌ఎఫ్) కమాండర్ సత్యనారాయణ అన్నారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం బుధవారం విద్యార్థులకు అవగాహన కల్పించింది. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ ఆవరణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మండల పరిధిలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 11వ తేదీ నుంచి 27వ తేదీ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. అనంతరం రెవెన్యూ,పోలీసు,యలమంచిలి అగ్నిమాపకశాఖ అధికారుల ఆధ్వర్యంలో ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం సభ్యులు మాక్‌డ్రిల్ నిర్వహించి తుపాన్లు, వరదలు సంభవించినప్పుడు, పిడుగులు పడినప్పుడు ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో ప్రత్యక్షంగా వివరించారు. గ్యాస్ లీకైనప్పుడు,అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవలసిన చర్యలు, గాయాలు తగిలినప్పుడు చేయవలసిన ప్రథమ చికిత్స గురించి వివరించారు.ఈ కార్యక్రమంలో రాంబిల్లి తహసీల్దారు శ్రీనివాసరావు,రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, సీఐ సీహెచ్. నర్సింగరావు,యలమంచిలి అగ్నిమాపకశాఖ అధికారి డి.రాంబాబు, రాంబిల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వేణుగోపాల్, వీఆర్‌వోలు, వీఆర్ఏలు వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



డీఈవో అప్పారావునాయుడుకి వినతిపత్రం అందజేస్తున్న గొంది చిన్నబ్బాయ్

అనకాపల్లి: జిల్లాలో ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చిన్నబ్బాయ్ కోరారు. ఈ మేరకు డీఈవో కార్యాలయంలో డీఈవో జి.అప్పారావు నాయుడుకు బుధవారం వినతిపత్రం అందజేశారు. టెన్త్ విద్యార్థులకు నిర్వహించే ప్రత్యేక తరగతులను ఆదివారం, సెలవు రోజుల్లో రద్దు చేయాలని, పీడీ ప్రమోషన్ కోసం ఉన్నత విద్యను అభ్యసించే ఎస్జీటీలకు స్టడీ లీవ్ మంజూరు చేయాలని కోరారు. పదోతరగతి స్పాట్ వాల్యుయేషన్ చేసిన కొంతమంది ఉపాధ్యాయులకు నేటికీ రెమ్యూనరేషన్ ఇవ్వలేదని, వారికి వెంటనే మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు వత్సవాయి శ్రీలక్ష్మి, జిల్లా కార్యదర్శి జి.ఎస్.ప్రకాష్, రాష్ట్ర కౌన్సిలర్ ఎం.వి. అప్పారావు, మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మామిడి బాబూరావు, నాతవరపు సతీష్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల ప్రదర్శన అ'ద్వితీయ'ం

రెండో రోజు ఉత్సాహంగా బాలోత్సవాలు



గ్రామ సమస్యలపై ప్రదర్శిస్తున్న నాటకంలో తీర్పు ఇస్తున్న గ్రామ పెద్ద

డాబాగార్డెన్స్(విశాఖ): సందడిగా జానపద నృత్యాలు.. ఆకట్టుకునే నృత్య రూపకాలు.. పులి వేషాల్లో బాలల హంగామాతో విశాఖ బాలోత్సవం ఆకట్టుకుంది. మహారాణిపేటలోని సెయింట్ ఆంథోనీ ప్రాథమిక పాఠశాలలో నిర్వహిస్తున్న బాలోత్సవంలో రెండో రోజు బుధవారం సాంస్కృతిక, జానపద ప్రదర్శనల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పలు పాఠశాలల నుంచి అధిక సంఖ్యలో హాజరైన విద్యార్థులు తమ ప్రతిభతో ఆకట్టుకున్నారు. నిర్వాహకులు మాట్లాడుతూ పిల్లలు చదువుతో పాటు నైతిక విలువలు పెంపొందించుకోవడం, పెద్దలను గౌరవించడం, తల్లిదండ్రులను కాపాడుకోవల్సిన బాధ్యత వంటివి అవగాహన కల్పించే విధంగా ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో బాలోత్సవం కమిటీ కార్యదర్శి జీఎస్ రాజేశ్వరరావు, ఉపాధ్యక్షురాలు కె.రమాప్రభ, కమిటీ సభ్యులు ఎం.ఎల్లాజీ, వై.సత్యనారాయణ, ఎం.గుణశంకర్, సంతోష్ పాల్గొన్నారు.

ఐఎన్ఎస్ డేగాలో విద్యార్థులు

విశాఖ సిటీ: నేవీ దినోత్సవ వేడుకల్లో భాగంగా విశాఖలో పలు పాఠశాలల నుంచి వెయ్యి మందికి పైగా విద్యార్థులు బుధవారం ఇండియన్ నేవీ ఎయిర్‌స్టేషన్ ఐఎన్ఎస్ డేగాను సందర్శించారు. అక్కడ వైమానిక, క్విక్ రియాక్షన్ టీమ్, డాగ్ స్క్వాడ్, ఫైర్ ఫైటింగ్ ప్రదర్శనలను తిలకించారు. అలాగే మెడికల్ యూనిట్లు, సీపీఆర్ టెక్నిక్‌లపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సాయుధ దళాల్లో విద్యార్థులు తమ కెరీర్‌ను అన్వేషించుకునే విధంగా చేయాలన్న లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

రైళ్లకు కొత్త నంబర్లు

తాటిచెట్లపాలెం(విశాఖ): ఈస్ట్‌కోస్ట్ రైల్వే వాల్తేర్ డివిజన్ పరిధిలో నడిచే పలు రైళ్ల నంబర్లు మార్పులు చేసినట్లు సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ ఓ ప్రకటనలో తెలిపారు. కింద పేర్కొన్న రైళ్లు 2025 జనవరి 1 నుంచి మారిన నంబర్లతో నడుస్తాయని, ప్రయాణికులు ఈ మార్పును గమనించాలని సూచించారు.

రైలు	ప్రస్తుత నంబర్	కొత్త నంబర్
కటక్–గుణుపూర్ మెము	08421	68433
గుణుపూర్–కటక్ మెము	08422	68434
విశాఖపట్నం–కిరండూల్ పాసింజర్	08551	58501
కిరండూల్–విశాఖపట్నం పాసింజర్	08552	58502
విశాఖపట్నం–రాయ్‌పూర్ పాసింజర్	08528	58528
రాయ్‌పూర్–విశాఖపట్నం పాసింజర్	08527	58527
విశాఖపట్నం–కోరాపుట్ పాసింజర్	08546	58538
కోరాపుట్ –విశాఖపట్నం పాసింజర్	08545	58537
విశాఖపట్నం–బ్రహ్మపూర్ పాసింజర్	08531	58532
బ్రహ్మపూర్–విశాఖపట్నం పాసింజర్	08532	58531
విశాఖపట్నం–గుణుపూర్ పాసిజంర్	08522	58506
గుణుపూర్–విశాఖపట్నం పాసింజర్	08521	58505
విశాఖపట్నం–భవానిపట్న పాసింజర్	08504	58504
భవానిపట్న–విశాఖపట్నం పాసింజర్	08503	58503

కింద పేర్కొన్న రైళ్లు 2025 మార్చి నుంచి మారిన నంబర్లతో నడుస్తాయి

రైలు	ప్రస్తుత నంబర్	కొత్త నంబర్
విశాఖపట్నం–కడప తిరుమల ఎక్స్‌ప్రెస్	17488	18521
కడప–విశాఖపట్నం తిరుమల ఎక్స్‌ప్రెస్	17487	18522
విశాఖపట్నం– గుంటూరు ఉదయ్ ఎక్స్‌ప్రెస్	22701	22875
గుంటూరు –విశాఖపట్నం ఉదయ్ ఎక్స్‌ప్రెస్	22702	22876
భువనేశ్వర్ – రామేశ్వరం ఎక్స్‌ప్రెస్	20896	20895
రామేశ్వరం – భువనేశ్వర్ ఎక్స్‌ప్రెస్	20895	20896
భువనేశ్వర్ – పుదుచ్చేరి ఎక్స్‌ప్రెస్	12898	12897
పుదుచ్చేరి – భువనేశ్వర్ ఎక్స్‌ప్రెస్	12897	12898
భువనేశ్వర్– చెన్నై సెంట్రల్ ఎక్స్‌ప్రెస్	12830	12829
చెన్నై సెంట్రల్ –భువనేశ్వర్ ఎక్స్‌ప్రెస్	12829	12830

వాల్తేరుకి వచ్చేదెవరో?

లంచం తీసుకుంటూ సీబీఐకి చిక్కిన డీఆర్ఎం సౌరభ్ కుమార్

- వ్యవస్థను సౌరభ్ నిర్వీర్యం చేశారంటూ పెద్ద ఎత్తున విమర్శలు
- పోస్ట్ ఖాళీ అయినా విశాఖ వచ్చేందుకు జంకుతున్న అధికారులు




సాక్షి, విశాఖపట్నం:

దాదాపు ఏడాదిన్నర కిందట వరకు రైల్వే వ్యవస్థలో వెలుగు వెలిగిన వాల్తేరు డివిజన్‌కు చీకటి రోజులు దాపురించాయి. డివిజనల్ రైల్వే మేనేజర్‌గా సౌరభ్‌కుమార్ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి విశాఖ రైల్వేస్టేషన్ అభివృద్ధి కుంటుపడింది. తన స్వలాభం కోసం మాత్రమే సౌరభ్ పనిచేశారన్న విషయం సీబీఐ దాడులతో సుస్పష్టమైంది. చేయి తడిపితేనే పనులకు పచ్చజెండా ఊపుతామన్న రీతిలో డీఆర్ఎం స్థాయి అధికారి వ్యవహరించడంతో.. అభివృద్ధిలో డివిజన్ వెనుకపడింది. ఆయన స్థానంలో కొత్తగా ఎవరు వస్తారన్న దానిపై ఇప్పుడు అంతటా ఉత్కంఠ నెలకొంది. ఈస్ట్ కోస్ట్ రైల్వే జోన్ పరిధిలో విశాఖ కేంద్రంగా ఉన్న వాల్తేరు రైల్వే డివిజన్‌కు దాదాపు 130 ఏళ్ల ఘన చరిత్ర ఉంది. 21 పాసింజర్ హాల్ట్‌లతో కలిపి మొత్తం 115 రైల్వే స్టేషన్‌లు డివిజన్ పరిధిలో ఉన్నాయి. ఈస్ట్ కోస్ట్ జోన్‌లో సరకు రవాణాతో పాటు ప్రయాణికుల రాకపోకల ఆదాయంలోనూ నంబర్‌వన్‌గా నిలిచింది. ఇంతటి చరిత్ర ఉన్న వాల్తేరు రైల్వే పరువును డీఆర్ఎం సౌరభ్‌కుమార్ ప్రసాద్ పట్టాలు తప్పించేశారు. సెంట్రల్ రైల్వే జోన్‌లో పీసీఎంఈగా పనిచేస్తున్న సమయంలోనే ఆయప వివాదాస్పదుడిగా పేరొందారు. అక్కడి నుంచి డీఆర్ఎంగా గతేడాది జూలైలో వచ్చిన తర్వాత.. అవినీతి వ్యవహారాలను వేగవంతం చేసేశారు. డివిజన్ పరిధిలో చిన్న టెండర్ కావాలన్నా.. లంచం డిమాండ్ చేసేవారనే ఆరోపణలు ఉన్నాయి. రూ.25 వేల నుంచి రూ.కోట్ల వరకూ కాంట్రాక్టర్ల దగ్గర నుంచి అందినకాడికి పిండుకున్నారని విమర్శలు ఉన్నాయి. ఎవరైనా వ్యతిరేకంగా మాట్లాడితే ఆ కాంట్రాక్టర్ సంస్థను బ్లాక్ లిస్ట్‌లో పెడతామంటూ సౌరభ్‌కుమార్ అనుచరవర్గం బెదిరింపులకు కూడా పాల్పడినట్లు తెలుస్తోంది. దీంతో డివిజన్ పరిధిలో పనులకు టెండర్లు ఆహ్వానించినా.. ఎవరూ ముందుకురాని పరిస్థితి ఏర్పడింది. ఫలితంగా వాల్తేరు పరిధిలో పనులన్నీ నిలిచిపోయాయి.

డివిజన్ అభివృద్ధి ఎక్కడ?

డీఆర్ఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత సొంత అజెండాపైనే దృష్టి సారించిన సౌరభ్‌కుమార్ విశాఖ రైల్వేస్టేషన్, వాల్తేరు డివిజన్ అభివృద్ధిని పట్టించుకోవడం మానేశారు. ఆయన హయాంలో వచ్చిన కొత్త రైళ్లన్నీ గతంలో ప్రతిపాదన చేసినవే.. ఆయన మార్కు అంటూ ఎక్కడా చూపించలేకపోయారు. రైల్వేస్టేషన్ ఆధునికీకరణ పనుల విషయంలోనూ డీఆర్ఎం తన హస్తలాఘవాన్ని చూపించినట్లు ఆరోపణలున్నాయి. సుమారు రూ.390 కోట్ల అంచనా వ్యయంతో విశాఖ రైల్వేస్టేషన్ ఆధునికీకరణ, మౌలిక వసతుల కల్పన మొదలైన పనులు చేపట్టాల్సి ఉన్నా.. భారీగానే ముడుపులు ఇవ్వాలంటూ కాంట్రాక్ట్ సంస్థపై ఒత్తిడి తీసుకొచ్చినట్లు తెలుస్తోంది. అందుకే దువ్వాడ లాంటి స్టేషన్‌లో దాదాపు 50 శాతం పనులు పూర్తయినా.. వైజాగ్ రైల్వేస్టేషన్‌లో మాత్రం 10 శాతం కూడా పూర్తి కాలేదు. తమ సమస్యలు పరిష్కరించాలంటూ వచ్చిన ఉద్యోగుల విషయంలోనూ నిర్లక్ష్యంగా వ్యవహరించే వారని డివిజన్ వర్గాలు చెబుతున్నాయి. దాదాపు 16 నెలల పాటు డీఆర్ఎంగా వెలగబెట్టిన సౌరభ్‌కుమార్.. వాల్తేరు పరువును దిగజార్చేశారు. అథపాతాళానికి పడిపోయిన డివిజన్‌కు కొత్త డీఆర్ఎంగా ఎవరు బాధ్యతలు చేపడతారన్న దానిపై అంతటా ఉత్కంఠ నెలకొంది. ఇప్పటికే రైల్వే బోర్డు పలువురు అధికారులను సంప్రదించగా.. విముఖత చూపినట్లు సమాచారం. కాగా.. గత అనూప్ సత్పతిని మళ్లీ డీఆర్ఎంగా నియమించాలని సోషల్ మీడియా ద్వారా పలువురు రైల్వే మంత్రికి, బోర్డుకు వినతులు పంపిస్తున్నారు.

అభివృద్ధి ఆగిపోయింది



ఏడాది కాలంలో కొత్త రైళ్లేవీ రాలేదు. విశాఖ స్టేషన్ అభివృద్ధి పూర్తిగా ఆగిపోయింది. గతంలో అనూప్‌కుమార్ సత్పతి డీఆర్ఎంగా ఉన్న సమయంలో చేసిన అభివృద్ధి పనులు, కొత్త రైళ్లను తీసుకురావడం వల్ల వైజాగ్ స్టేషన్‌కు ఎన్ఎస్‌జీ–1 గుర్తింపు వచ్చింది. సౌరభ్ వచ్చిన తర్వాత ఈస్ట్‌కోస్ట్, సౌత్ సెంట్రల్ రైల్వే ప్రత్యేక రైళ్లు నడుపుతున్నా.. అవి దువ్వాడ మీదుగానే వెళ్తున్నాయి. వీటిని వైజాగ్ తీసుకురావాలని కోరినా.. సౌరభ్ పట్టించుకోలేదు. పైగా అవినీతికి పాల్పడి సీబీఐకి చిక్కడం డివిజన్‌కు సిగ్గుచేటు.

– డేనియల్ జోసఫ్, రైలు ప్రయాణికుల ప్రతినిధి


సౌరభ్ పనితీరుపై అప్పుడే అనుమానాలు



వైజాగ్ రైల్వే వ్యవస్థ పరువును సౌరభ్‌కుమార్ రోడ్డున పడేశారు. డీఆర్ఎం స్థాయి ఉన్నతాధికారి లంచాలు తీసుకోవడం నిజంగా అవమానకరం. ఆయన హయంలో ఎన్నో ప్రమాదాలు సంభవించాయి. కనీసం దానిపై సమగ్ర విచారణ కూడా చేపట్టలేదు. అప్పుడే డీఆర్ఎం పనితీరుపై అందరిలోనూ అనుమానాలు వచ్చాయి. రైళ్ల కోసం అడిగినా ఏ ఒక్కరోజూ పట్టించుకోలేదు. బ్రింగ్‌బ్యాక్ అనూప్ అనే హ్యాష్‌ట్యాగ్‌తో రైల్వే మంత్రికి, బోర్డుకు వినతులు పంపిస్తున్నాం.

– రఘువంశీ, రైలు ప్రయాణికుల ప్రతినిధి

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



నాగభూషణం మృతదేహం

అగనంపూడి: రోడ్డు ప్రమాదంలో చేపల వ్యాపారి దుర్మరణం చెందాడు. దువ్వాడ పోలీస్టేషన్ పరిధి అగనంపూడి టోల్‌గేటుకు సమీపంలో జరిగిన ప్రమాదానికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చీడికాడ గ్రామం ఐటీఐ కాలనీకి చెందిన జనానాగభూషణం (52) చేపల వ్యాపారం చేస్తుంటాడు. గాజువాకలో బంధువుల ఇంట శుభకార్యం ఉండడంతో నాగభూషణం గాజువాక ద్విచక్రవాహనంపై వస్తున్నారు. అగనంపూడి టోల్‌గేటు దాటిన తర్వాత వెనుక నుంచి వచ్చిన లారీ బలంగా ఢీకొంది. ఈ సంఘటనలో తీవ్రంగా పడిన నాగభూషణం అక్కడికక్కడే మృతి చెందాడు. హెల్మెట్ ధరించి ఉన్నప్పటికీ మృత్యు వాత తప్పలేదు. పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కేజీహెచ్‌కు తరలించారు. మృతుడికి భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు.

హుండీల చోరీకి పాల్పడిన వ్యక్తి అరెస్ట్

- అనకాపల్లిలోని పలు ఆలయాల్లో హుండీల చోరీ
- నిందితుడి నుంచి నగదు, బైక్, సెల్ ఫోన్ స్వాధీనం



సీఐ పిన్నింటి రమణ, ఎస్ఐ సింహాచలం

సబ్బవరం: మండంలోని రాయపుర అగ్రహారం శ్రీకృష్ణుడి ఆలయంలో అక్టోబర్ 9న జరిగిన హుండీ చోరీ కేసును సబ్బవరం పోలీసులు ఛేదించారు. చోరీకి పాల్పడిన వ్యక్తి నుంచి రూ.11,554 నగదు, బైక్, ఒక సెల్‌ఫోన్‌తో పాటు చోరీకి వినియోగించిన పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్టు చేసి, అనకాపల్లి కోర్టులో హాజరుపర్చినట్లు సీఐ పిన్నింటి రమణ తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో బుధవారం నిర్వహించిన విలేకర్ల సమావేశం వివరాలను వెల్లడించారు. సబ్బవరం మూడు రోడ్ల కూడలి సమీపంలోని సినిమాహాల్ జంక్షన్ టీ స్టాల్ వద్ద ఒక వ్యక్తి చిల్లర కాయిన్స్ ఇచ్చి నోట్లు అడుగుతుండటంతో అక్కడే తన సిబ్బందితో ఉన్న ఎస్ఐ సింహాచలం అనుమానం వచ్చి స్టేషన్‌కు తరలించి విచారించారు. అతడిని శెట్టి నాయుడుగా గుర్తించారు. నాలుగేళ్లుగా బెలూన్ల డెకరేషన్ పనిచేస్తూ అనకాపల్లి గూండాల వీధిలో నివాసం ఉంటున్నాడు. అక్టోబర్ 9న రాయపుర అగ్రహారంలోని శ్రీకృష్ణ ఆలయంలో హుండీ తాళం పగులగొట్టి అందులోని నగదును సంచిలో వేసుకుని, హుండీని పక్కనే ఉన్న తుప్పల్లో పడేసి పోయాడు. ఈ నెల 9న జీ కోడూరు మండలం, వారాడలోని దుర్గాలమ్మ గుడి హుండీని, 2022 మార్చిలో దేవరాపల్లి మండలంలోని కలిగొట్ల గ్రామంలో పైడితల్లమ్మ గుడి హుండీని కూడా శెట్టి నాయుడే చోరీ చేసినట్లు విచారణలో తేలిందని సీఐ వెల్లడించారు. నిందితుడు నాయుడుని అరెస్టు చేసి, అనకాపల్లి కోర్టుకు తరలించామన్నారు. సమావేశంలో సీఐతోపాటు ఎస్ఐ సింహాచలం పాల్గొన్నారు.

క్లుప్తంగా

22న విద్యుత్ సరఫరా బంద్

అనకాపల్లి: విద్యుత్‌శాఖ డి–1 సెక్షన్ **పరిధిలో** మరమ్మతు పనుల నిమిత్తం ఈనెల **22వ తేదీ** ఉదయం 8 నుంచి మధ్యాహ్నం **2 గంటల** వరకూ విద్యుత్ సరఫరాను **నిలిపివేయను**న్నట్టు ఆశాఖ ఈఈ కె.రాజశేఖర్, **ఏఈ త్రినా**థ్‌లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నెహ్రూచౌక్ జంక్షన్, న్యూకాలనీ, వేల్పులవీధి గర్ల్స్‌హైస్కూల్ రహదారి, జీవీఎంసీ కార్యాలయం ఏరియా, తహసీల్దార్ కార్యాలయం రహదారి, పాత బర్మాకాలనీ, నర్సింగరావుపేట, చవితిని వీధి, రింగ్‌రోడ్డు, పెరుగుబజార్ జంక్షన్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరానునిలిపివేయనున్నట్టు పేర్కొన్నారు.

రోడ్డు పనులు ప్రారంభం



రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ లక్ష్మి

తుమ్మపాల: మండలంలో శంకరం రాజీవ్ గృహకల్ప సముదాయం వద్ద బుధవారం రోడ్డు నిర్మాణ పనులను సర్పంచ్ పసుపులేటి లక్ష్మి, ఎంపీటీసీ మంత్రి సంతోషం ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ జాతీయ రహదారికి అనుసంధానంగా సరైన రోడ్డు లేక రాజీవ్ గృహసముదాయం వాసులు ఇబ్బంది పడుతుండడంతో ఎంపీపీ గొర్లి సూరిబాబు రూ.8 లక్షల మండల పరిషత్ నిధులను మంజూరు చేసినట్టు చెప్పారు. అసంపూర్తిగా ఉన్న రోడ్డుతో పాటు డ్రైనేజీలు నిర్మించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ సర్పంచ్ జి.తాతబాబు, నాయుకులు పసుపులేటి రామకృష్ణ, కరణం బైరాగి, లక్ష్మణరావు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన



రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో రవికుమార్

కశింకోట: మండలంలోని ఏనుగుతుని గ్రామంలో ఉపాధి హామీ పథకంలో చేపట్టిన సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులను బుధవారం ఎంపీడీవో వి.వి.రవికుమార్ పరిశీలించారు. త్వరితగతిన నిర్మాణం పూర్తి చేయాలని ఆదేశించారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు బుధవారం 2,882 దిమ్మలు వచ్చాయి

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,160	4,580
మొదటి రకం	3,450	4,000
రెండో రకం	3,280	3,750
మూడోరకం	3,900	3,260

అనకాపల్లి సినిమాలు

దేవర	: రాజా
'క'	: సత్యనారాయణ స్క్రీన్-1
అమరాన్	: సత్యనారాయణ స్క్రీన్-2
కంగువ	: పర్తిసాయి
మట్కా	: షిర్డిసాయి
గ్లాడియేటర్	: వెంకటేశ్వర
విశ్వం	: శ్రీసత్య
లక్కీ భాస్కర్	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 32 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఎ పాజిటివ్-5 యూనిట్లు, బి పాజిటివ్-11 యూనిట్లు, ఒ పాజిటివ్-15 యూనిట్లు, ఏబీ పాజిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ య.లోకేష్(ఫోన్ నంబర్ 9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా బుధవారం 397 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 331 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి (ఫోన్ నంబర్ 08924-223595)ని సంప్రదించవచ్చును.

భక్తుల కోర్కెలు తీర్చే కల్పవల్లి.. పడమటమ్మ తల్లి

- నేడు భారీ ఎత్తున పుట్టుక ఉత్సవం
- ఏర్పాట్లు పూర్తి చేసిన కమిటీ



విసన్నపేట వద్ద లోవలో ఏడాకుల మర్రి రూపంలో వెలసి పూజలందుకుంటున్న అమ్మ వారు



పడమటమ్మ వారు

కశింకోట: భక్తులు కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా పేరొందిన పడమటమ్మ ఉత్సవం నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లాలోజరిగే పెద్ద ఉత్సవాల్లో ఒకటిగా పేర్కొందిన ఈ జాతరను గురువారం భారీ ఎత్తున మండల కేంద్రం కశింకోటలో నిర్వహించనున్నారు. రెండేళ్లకోమారు కార్తీక మాసంలో ఉత్సవాన్ని నిర్వహిస్తారు. ఉత్సవం సందర్భంగా జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి అమ్మ వారిని దర్శించుకుంటారు.

శతాబ్దాల చరిత్ర

పడమటమ్మ వారికి సుమారు రెండు శతాబ్దాల చరిత్ర ఉంది. కశింకోటలోని 'గొంతిన' ఇంటి పేరు కలిగిన కుటుంబంలో పడమటమ్మ జన్మించింది. పదేళ్ల ప్రాయంలో పశువులను మేపడానికి వెళ్లిన ఆమె ఇక్కడి సమీపంలోని విసన్నపేట గ్రామం వద్ద పడమటమ్మ లోవలో అంతర్ధానమైనట్టు స్థానికుల కథనం. గొంతిన కుటుంబ సభ్యుల కలలో కనిపించి పడమటమ్మగా ప్రస్తుతం విసన్నపేట గ్రామం వద్ద కొండల్లో అరుదుగా కనిపించే ఏడాకుల మర్రి చెట్టు వద్ద వెలిశానని, తనను కొలుస్తూ ఉత్సవాన్ని నిర్వహించాలని పేర్కొన్నట్లు పెద్దలు చెబుతారు. సాక్షాత్తు పార్వతీదేవి... పడమటమ్మగా వెలసి పూజలందుకుంటున్నట్టు మరికొందరు చెబుతారు. ఈ నేపథ్యంలో కశింకోటలోని గొంతిన కుటుంబ సభ్యులు రెండేళ్లకోసారి పుట్టుక ఉత్సవాన్ని దాతలు, ప్రజల సహకారంతో భారీ ఎత్తున నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆ రోజు గొంతిన కుటుంబ సభ్యులు ఉపవాసం ఉండి, పల్లకీని అందంగా బంతి పూలతో అలంకరించి సంప్రదాయ డప్పులు, వాయిద్యాలు, భజనలతో ఊరేగింపుగా కశింకోట నుంచి లోవకు పంట పొలాల మీదుగా చేరుకుంటారు. పంటలను తొక్కుకుని వెళతారు. దీనివల్ల అమ్మ వారి కరుణతో పంటలు సుభిక్షంగా పండుతాయని రైతులు విశ్వాసం. లోవలో అమ్మ వారి స్వరూపంగా కొలిచే ఏడాకుల మర్రి చెట్టు వద్ద పూజలు నిర్వహిస్తారు. అనంతరం ఉత్సవ నిర్వాహకులు భక్తి భావంతో పిలిస్తే అమ్మ వారు మిడత, చిన్న పురుగు తదితర రూపాల్లో వస్తుందని భక్తుల నమ్మకం. అలా వచ్చిన మిడతను భరిణెలో నిలిపి కశింకోట శివారు వరకు పల్లకీలో తీసుకు వచ్చి అక్కడి నుంచి ఊరేగిస్తారు. కోరిన కోర్కెలను తీర్చే కల్పవల్లిగా పూజలందుకుంటున్న పడమటమ్మ వారిని ప్రత్యక్ష దేవతగా భావించి మిడత, పురుగు తదితర రూపాల్లో దర్శించుకునేందుకు భక్తులు తండోపతండాలుగా వస్తారు. ఉమ్మడి విశాఖ జిల్లాతోపాటు ఇతర ప్రాంతాల్లో ఉద్యోగ రీత్యా స్థిరపడిన వారంతా తమ కుటుంబాలతో ఉత్సవానికి హాజరవుతారు. పుట్టుక మహోత్సవం అనంతరం అమ్మ వారిని స్థానిక కస్పా వీధిలో వెలసి ఉన్న పడమటమ్మ ఆలయంలో నిలిపి పూజలు నిర్వహించి, నెల రోజుల తర్వాత పండగ నిర్వహిస్తారు.

కళ్లు మిరుమిట్లుగొలిపేలా..

ఉత్సవాన్ని భారీగా నిర్వహించడానికి సన్నాహాలు చేసినట్టు పడమటమ్మ ఉత్సవ కమిటీ తెలిపింది. ఈ సందర్భంగా జాతీయ రహదారి, స్థానిక పంచాయతీ ప్రధాన రహదారి, పోస్టాఫీసు వీధి, పూసర్ల వీధి, సంతబయల, పెద్ద బజారు తదితర ప్రాంతాల్లో కళ్లు మిరుమిట్లుగొలిపేలా విద్యుత్ దీపాలంకరణ ఏర్పాటు చేశారు. ఉత్సవంలో పెద్ద ఎత్తున బాణ సంచా కాల్చనున్నారు. ఉత్సవం సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు కమిటీ సభ్యులు తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీఎత్తున పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్టు సీఐ అల్లు స్వామినాయుడు తెలిపారు. ఉత్సవానికి వచ్చే ప్రజలు తమ వాహనాలను నిర్దేశిత ప్రాంతాల్లో నిలపాలని ఆయన సూచించారు.



ప్రధాన రహదారిలో ఏర్పాటు చేసిన విద్యుద్దీపాలంకరణ



రామ మందిరం సెట్టింగ్

అధ్వాన పాలనతో ప్రజలు అవస్థల పాలు



సమావేశంలో మాట్లాడుతున్న గంటా శ్రీరామ్

అనకాపల్లి: కూటమి ప్రభుత్వ అధ్వాన పాలనతో రాష్ట్రంలో ప్రజలు అవస్థలకు గురవుతున్నారని సీపీఎం మండల కన్వీనర్ గంటా శ్రీరామ్ తెలిపారు. నిత్యావసర ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో బడుగు, బలహీన వర్గాల ప్రజలు పలు ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. స్థానిక దొడ్డి రామునాయుడు భవనంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధి అవకాశాలు లేక నిరుద్యోగులు నిరాశ నిస్పృహలతో కొట్టుమిట్టాడుతున్నారని చెప్పారు. ఎన్నికల సమయంలో సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేస్తామని చెప్పిన నాయకులు అధికారం చేపట్టి ఐదు నెలలు అయినప్పటికీ అమలు చేసేందుకు మీనమేషాలు లెక్కపెడుతున్నారని ధ్వజమెత్తారు. గ్రామాల్లో టోల్ గేట్లు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవడం అన్యాయమన్నారు. శాంతి భద్రతల పరిరక్షణ బాగోలేదని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ స్వయంగా చెప్పారని, ఆ తరువాత కూడా లైంగికదాడులు, మహిళలపై వేధింపుల కట్టడికి ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడంతో దారుణమన్నారు. తాజాగా విశాఖలో 'లా' విద్యార్థినిపై నలుగురు లైంగిక దాడికి పాల్పడ్డారని, రోజురోజుకు ఇటువంటి సంఘటనలు రాష్ట్రంలో ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. నేరాలు పెరిగిపోవడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ సభ్యులు కె.తేలయ్యబాబు, బి.ఉమామహేశ్వరరావు, జి.సుభాషిణి, బుగిడి నూకఅప్పారావు తదితరులు పాల్గొన్నారు.

పల్లె రహదారుల్లో యూజర్ చార్జీల వసూలు అన్యాయం

అనకాపల్లి: పల్లె రహదారులపై యూజర్ చార్జీలు వసూలు చేయనున్నట్టు సీఎం చంద్రబాబునాయుడు అసెంబ్లీలో ప్రకటించడం అన్యాయమని సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టీడీపీ ప్రభుత్వం వచ్చే ఏడాది సంక్రాంతి నాటికి రాష్ట్రంలో అన్ని ప్రాంతాల్లో రహదారులు బాగుచేస్తామని చెప్పి, జాతీయ రహదారుల తరహాలో పల్లెల్లో అన్ని ప్రధాన రహదారుల్లో టోల్‌గేట్లు ఏర్పాటు చేయనున్నట్టు చంద్రబాబునాయుడు చెప్పడం బాధాకరమన్నారు. సంపద సృష్టించడం అంటే ఇదేనా అని ప్రశ్నించారు. ప్రజలపై మోయలేని భారం వేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో నిత్యావసర వస్తువుల ధరలు పెరగడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, విద్యుత్‌శాఖలో ట్రూ అప్ చార్జీల పేరుతో ప్రజలపై రూ.18వేల కోట్లు భారం వేయనున్నారని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో టోల్‌గేట్లు, విద్యుత్ ట్రూ అప్ చార్జీలు నిలుపుదల చేయాలని లేని, పక్షంలో ఉద్యమాలు చేస్తామని పేర్కొన్నారు.

వరిలో రెల్లరాల్చు పురుగు



పొలం పిలుస్తోంది కార్యక్రమంలో రైతులకు సూచనలిస్తున్న రంగాచారి

తుమ్మపాల: వరిలో రెల్ల రాల్చు పురుగు అధికంగా ఉందని, పర్మెత్రిన్ మందు ఎకరాకు 400 మిల్లీ లీటర్లు చొప్పున పిచికారీ చేయడం ద్వారా దానిని నియంత్రించ వచ్చని మండల వ్యవసాయ అధికారి పి.రంగాచారి తెలిపారు. మండలంలో తుమ్మపాల, సీహెచ్.ఎస్.అగ్రహారం, వల్లూరు గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించి, వరి చేనును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెల్ల రాల్చు పురుగుతో పాటుగా ఆకు ముడత పురుగు నివారణకు క్లోరాంట్రినిలిప్రోల్ 60 మిల్లీలీటర్లను ఎకరాకు పిచికారీ చేయాలన్నారు. గింజ ఇంకా కొంచెం పచ్చిగా ఉన్నప్పుడు బైఫెంత్రిన్ 500 మిల్లీలీటర్లు పిచికారీ చేయడం ద్వారా రెల్ల రాల్చు పురుగుతోపాటు కంకినల్లి, ఆకుముడత పురుగులను కూడా నియంత్రించవచ్చని చెప్పారు.

స్మార్ట్ మీటర్లు వద్దే వద్దు



విద్యుత్‌శాఖ ఎస్ఈ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేస్తున్న భద్రం

అనకాపల్లి: స్మార్ట్ మీటర్ల ఏర్పాటును నిలిపివేయాలని సీపీఐ జోనల్ కార్యదర్శి వైఎస్.భద్రం డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక గవరపాలెం విద్యుత్‌శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్ జి.ప్రసాద్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్మార్ట్‌మీటర్లు బిగిస్తే పగలగొట్టండని ప్రతిపక్షనేతగా ఉన్నప్పుడు ప్రజలకు పిలుపు నిచ్చిన చంద్రబాబునాయుడు.. అధికారం చేపట్టిన తరువాత మాటమార్చి స్మార్ట్ మీటర్లు బిగించాలని ఆదేశాలు జారీ చేయడం అన్యాయమన్నారు. 2019 నుంచి సర్దుబాటు చార్జీల పేరుతో వేలకోట్ల రూపాయలు పేద ప్రజల నుంచి ముక్కు పిండి వసూలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. వ్యవసాయ పంపుసెట్లకు ఉచిత విద్యుత్ ప్రకటించిన ప్రభుత్వం ఇప్పుడు స్మార్ట్ మీటర్లు బిగించడం వెనుక కుట్రదాగి ఉందన్నారు. స్మార్ట్ మీటర్లు బిగించిన తరువాత మీటర్ రీడర్స్, విద్యుత్ ఉద్యోగులను త్వరలో తొలగిస్తారని చెప్పారు. ఈ సందర్భంగా విద్యుత్‌శాఖ ఎస్ఈ ప్రసాద్ మాట్లాడుతూ గృహాలకు స్మార్ట్ మీటర్లు బిగించబోమని, వాణిజ్య సముదాయాలకు మాత్రమే బిగిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల నాయకులు చెల్లూరు నాగరాజు, కోరుబిల్లి శంకరరావు, శ్రీరామదాసు అబ్బులు, కొమనాపల్లి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ పనులకు శంకుస్థాపన



డ్రైనేజీ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ లక్ష్మీరామకృష్ణ

అనకాపల్లి: మండలంలోని శంకరం గ్రామంలో దశల వారీగా డ్రైనేజీ వ్యవస్థను అభివృద్ధి చేయనున్నట్టు సర్పంచ్ పసుపులేటి లక్ష్మీరామకృష్ణ తెలిపారు. గ్రామంలో రూ.8లక్షల ఎంపీపీ నిధులతో నిర్మించనున్న డ్రైనేజీ పనులకు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు.

క్రికెట్ విజేతలకు అభినందన



క్రికెట్ క్రీడాకారులను అభినందిస్తున్న కోటిపల్లి జేజిబాబు

అనకాపల్లి: కంచి కామాక్షి స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో గాజువాకలో జరిగిన విశాఖ ఉమ్మడి జిల్లా క్రికెట్ టోర్నమెంట్‌లో విజయం సాధించిన అనకాపల్లి స్వర్ణకార సంఘం టీమ్‌ను అనకాపల్లి విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు కోటిపల్లి జేజిబాబు బుధవారం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టోర్నమెంట్‌లో బెస్ట్ బ్యాట్స్‌మన్‌గా ముక్కాల రాజశేఖర్, బెస్ట్ బౌలర్‌గా కణితి ఉమా బహుమతులు సాధించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షుడు మత్తుర్తి గంగరాము, సభ్యులు తణుకు రవికుమార్, కిల్లాడి శ్రీనివాసరావు, దోసూరు చంద్రోఖర్, పొన్నాడ పెదబాలు పాల్గొన్నారు.

గ్రామాల్లో ప్రత్యేక ఆధార్ శిబిరాలు

కోటవురట్ల: మండలంలోని యండపల్లి, అన్నవరం గ్రామాల్లో ఆధార్ ప్రత్యేక శిబిరాలను నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు తెలిపారు. యండపల్లిలో ఈ నెల 22 వరకు, అన్నవరంలో ఈ నెల 26 నుంచి 29వ తేదీ వరకు ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తామన్నారు.

గ్రంథాలయాలను వినియోగించుకోవాలి



కశింకోటలో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న తహసీల్దార్ శ్రీనివాసరావు



మాట్లాడుతున్న ఆదారి గోవింద

కశింకోట: విద్యార్థులు గ్రంథాలయాలను వినియోగించుకుని, విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని తహసీల్దార్ ఎ.శ్రీనివాసరావు సూచించారు. స్థానిక గ్రంథాలయంలో నిర్వహించిన గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. వ్యాస రచన, చిత్ర లేఖనం, మ్యూజికల్ చైర్, పాటలు, క్విజ్ పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞానాన్ని అందిస్తాయని చెప్పారు. కోదండ సీతారామ చంద్రమూర్తి స్వామి ఆలయ కమిటీ మాజీ చైర్మన్ శిష్టి అప్పారావు అధ్యక్షతన జరిగిన సభలో ఎంఈవో పి.వి.సురేష్, ఏపీజీవీబీ బ్రాంచ్ స్థానిక మేనేజర్ వి.కల్పిత, రిటైర్డు ఉపాధ్యాయుడు యల్లపు రామచంద్రరావు, గ్రంథాలయ అధికారి కె.వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులోకి పోటీ పరీక్షల పుస్తకాలు

అనకాపల్లి: నిరుద్యోగులకు వివిధ పోటీ పరీక్షలకు కావలసిన పుస్తకాలను గ్రంథాలయంలో అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకుంటామని గ్రంథాలయ వారోత్సవాల నిర్వహణ కమిటీ కన్వీనర్ ఆదారి గోవింద తెలిపారు. 57వ గ్రంథాలయల వారోత్సవాలను పురస్కరించుకుని మండలంలోని తుమ్మపాలలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. డీఎస్సీ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు ఉపయోగపడే పుస్తకాలను దాతలు సాయంతో గ్రంథాలయంలో ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తట్టా పెంటయ్యనాయుడు, ఎంపీటీసీ పంచదారల కన్నారావు తదితరులు పాల్గొన్నారు.

బాల కార్మికుల గుర్తింపునకు తనిఖీలు



కశింకోటలో తనిఖీలు నిర్వహిస్తున్న కార్మిక, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది

కశింకోట: బాల కార్మికులను గుర్తించడానికి వివిధ శాఖల అధికారులు, సిబ్బంది బుధవారం ఆకస్మికంగా తనిఖీలు చేశారు. మండల కేంద్రం కశింకోటలో దుకాణాలు, బేకరీలు, హోటళ్లలో తనిఖీ చేసి, బాల కార్మికులపై ఆరా తీశారు. 18 ఏళ్లలోపు పిల్లలను పనుల్లో పెట్టుకోరాదని, అందుకు విరుద్ధంగా వ్యవహరించే దుకాణాలు, హోటళ్ల నిర్వాహకులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్మిక శాఖ అధికారులు నరేంద్ర, సయ్యద్, బాలబాలికల సంరక్షణ సమితి ప్రతినిధి లోవరాజు, ఐసీడీఎస్ సూపర్వైజర్ ఝాన్సీ, హెడ్‌కానిస్టేబుల్ సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

భారీ ఎత్తున అంబలం పూజ



పూజ నిర్వహిస్తున్న శ్రీనివాసరావు గురుస్వామి

అనకాపల్లి: స్థానిక గవరపాలెం పీలావారి గౌరీపరమేశ్వరుల ఆలయం వద్ద వ్యాపారవేత్త యల్లపు శ్రీనివాసరావు, బాల సరస్వతి దంపతులు బుధవారం రాత్రి భారీ ఎత్తున అయ్యప్ప అంబలం పూజ నిర్వహించారు. గవరపాలెం పురవీధుల మీదుగా అయ్యప్పస్వామి పాదుకలు ఊరేగింపు నిర్వహించారు. అనంతరం 600 మంది అయ్యప్పలకు అన్నసమారాధన జరిపారు. ఈ కార్యక్రమంలో స్వాములు జయంత్, భార్గవ్, అప్పారావు, సూరిబాబు, గురుస్వాములు పాల్గొన్నారు.

నాగులాపల్లిలో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు



దళితవాడలో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

మునగపాక: మండలంలోని నాగులాపల్లి దళితవాడలో బుధవారం క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. మునగపాక పీహెచ్‌సీ ఆధ్వర్యంలో కాలనీవాసులకు బీపీ, మధుమేహం, క్యాన్సర్‌కు సంబంధించి ఉచితంగా వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్‌హెచ్‌పీ ఆశా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలన్నారు. తాజా ఆహారంతో పాటు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలన్నారు. ప్రతి ఆరు నెలలకు ఒకసారి వైద్య పరీక్షలు చేయించుకోవడం మంచిదన్నారు. జంక్ ఫుడ్స్‌కు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం పద్మ, జిల్లా దళిత బహుజన యువజన సేవా సంఘం అధ్యక్షుడు డొక్కా శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

సత్యసాయి మందిరంలో ప్రత్యేక పూజలు

అనకాపల్లి: సత్యసాయిబాబా 99వ జయంతి వేడుకల్లో భాగంగా స్థానిక గవరపాలెం పార్కుసెంటర్ వద్ద గల సత్యసాయి మందిరంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుప్రభాత సేవ, నగర సంకీర్తన , బాల వికాస్ విద్యార్థినీవిద్యార్థులతో 108 సార్లు సాయి గాయత్రీ పారాయణం, వేద పఠనం నిర్వహించారు. రాత్రి గౌరీ అమృత వర్షిణి కోలాట బృందం కోలాటం ప్రదర్శించింది.

కశింకోట: స్థానిక కోమటి వీధిలో ఉన్న సత్య సాయి బాబా మందిరంలో మహిళలు బుధవారం రుద్రాభిషేకం నిర్వహించారు. బాబా జయంతి ఉత్సవాల్లో భాగంగా సుప్రభాత సేవ, నగర సంకీర్తన నిర్వహించారు. మందిర ప్రతినిధి ముక్కా అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

25న రామలింగేశ్వరస్వామి కల్యాణోత్సవం



కల్యాణోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

మునగపాక: పాటిపల్లి రామలింగేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాన్ని ఈ నెల 25న ఘనంగా నిర్వహించనున్నట్టు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ మేరకు బుధవారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 23న కల్యాణ రాట వేస్తామన్నారు. 25న ఉదయం 9 గంటల నుంచి ఆలయ ప్రాంగణంలో శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తామని చెప్పారు. అదే రోజు మధ్యాహ్నం భారీ అన్నసమారాధన ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. సాయంత్రం 5 గంటలకు మంగళ వాయిద్యాల నడుమ గ్రామ వీధుల్లో అమ్మవారికి సారె ఊరేగింపు చేపడతామన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కల్యాణోత్సవాన్ని తిలకించి, తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

వైభవ వెంకన్న కల్యాణోత్సవాలకు శ్రీకారం



స్వామి కల్యాణ మహోత్సవాలకు పుట్టమన్ను తెస్తున్న బొలిశెట్టి దంపతులు

ఎస్.రాయవరం: ఎస్.రాయవరంలో వైభవ వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ ధర్మకర్త బొలిశెట్టి గోవిందరావు, శారదా దంపతులు పుట్టమన్ను తెచ్చి నవధాన్యాలు నాటి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. అంతకు ముందు ఆలయ ప్రాంగణంలో సన్నాయి మేళాల మధ్య పుట్ట మన్ను తెచ్చేందుకు బొలిశెట్టి దంపతులతో పాటు పేరంటాళ్లు, పలువురు మాలధారణ భక్తులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. ఈ సందర్భంగా స్వామికి విశేష పూజలు, పుణ్యాహవచనం, తీర్థ ప్రసాద గోష్టి నిర్వహించారు.